క్లుప్తంగా

గ్రామాభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక: మునగపాక గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా సహకరించాలని సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం జరిగిన గ్రామసభలో మాట్లాడారు. పారిశుధ్యం,వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి విషయంలో ప్రజలకు అందుబాటులో సేవలందిస్తున్నామన్నారు. అవసరమైన చోట రహదారులు, డ్రైన్లు, కల్వర్టులు, గ్రావెల్ రహదారులు నిర్మించామన్నారు. పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ముసిలినాయుడు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పరశురామ్, వార్డు సభ్యుడు అప్పలనాయుడు, ఎంపీటీసీ గణేష్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రామ్మోహనరావు పాల్గొన్నారు.

142 మందికి ఉచిత కంటి పరీక్షలు



కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న హైమ నేత్రాలయ బృందం

పాయకరావుపేట : వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో గల పాండురంగ దేవస్థానం ఆవరణలో ఉచిత వైద్య శిబిరం చేసినట్లు హైమ నేత్రాలయ వైద్యుడు శివరామ్ ప్రసాద్ తెలిపారు. 142 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు డి.ఎస్.మూర్తి, కండపల్లి జోసెఫ్, యోగా ఉపాధ్యాయుడు వి.ప్రసాద్ పాల్గొన్నారు.

డయేరియా బాధితులకు పరామర్శ

అచ్యుతాపురం: మోటూరుపాలేనికి చెందిన డయేరియా బాధితుల్ని సీపీఎం నాయకులు కేజీహెచ్‌లో పరామర్శించారు. ఈ మేరకు కేజీహెచ్‌కు సీపీఎం నాయకుడు ఆర్.రాము వెళ్లి గురువారం పరామర్శిచారు. చిన్నారి జనార్దన్ తల్లిదండ్రులతో మాట్లాడారు.

బొడ్డేటి ఆయకట్టుకు సాగునీరు విడుదల



సాగునీరు విడుదలకు వెళ్తున్న రైతులు

మాడుగుల రూరల్: కోనాం జలాశయం నుంచి బొడ్డేటి ఆయకట్టుకు సాగునీరు విడుదలైంది. కె.జె.పురం నీటి సంఘం ఆధ్వర్యంలో గురువారం కె.జె.పురం రైతులు పూజలు నిర్వహించి సాగునీరు విడుదల చేశారు. శిరిజాం చానల్ నుంచి బొడ్డేటి ఉప కాలువ ద్వారా ఖరీఫ్ అవసరాల కోసం సాగునీరు అందనుంది. నీటి సంఘం అధ్యక్షుడు సూరిశెట్టి అచ్చింనాయుడు, మాజీ అధ్యక్షుడు ఎం.వి.సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు భీశెట్టి శ్రీనివాసరావు, నాయకులు రాపేట జోగినాయుడు, శరగడం ఆదిబాబు, కర్రి అప్పలనాయుడు, పెంటకోట పెదకన్న, వేగి జగ్గారావు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలు



గొల్లలపాలెంలో పశువ్యాధి టీకాలు వేస్తున్న దృశ్యం

మునగపాక : మండలంలోని గొల్లలపాలెంలో గురువారం గొర్రెలు, మేకపోతులకు పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పేడ పరీక్షలు, రక్తపరీక్షలు జరిపారు. సీజన్‌లో పశువులు, మేకల్లో బ్రూ సెల్లోసిస్ వ్యాధి సోకుతుందని ఇందుకు పశువుల యజమానులు, పాడి రైతులు తగు పరీక్షలు చేయించి, నివారణ చర్యలు తీసుకోవాలని పశువైద్యాధికారి లావేటి ప్రదీప్‌కుమార్ సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన పశుశులను మంద నుంచి వేరు చేయాలన్నారు. కొత్తగా కొనుగోలు చేసిన పశువులను వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయకుండా మందలో కలపకూడదని తెలిపారు.

తల్లికి వందనం.. ప్రశ్నార్థకం!

- ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ వర్తింపజేస్తామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ
- వందనం సాయం కోసం తల్లుల ఎదురు చూపు



నక్కపల్లి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తల్లికి వందనం పథకం కింద ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి చదువుకునేందుకు ఏడాదికి రూ.15వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నమ్మి ప్రజలంతా ఓట్లేసి గెలిపించారు. విద్యాసం వత్సరం ప్రారంభమయింది. గత ప్రభుత్వం ఇచ్చే అమ్మవడి పథకానికి పేరు మార్చి తల్లికి వందనం పేరుతో ఆర్థిక సాయం ఇస్తామని ప్రకటించిన చంద్రబాబు సర్కారు ఇంకా ఆర్థిక సాయం ఇవ్వలేదు. స్కూళ్లు ప్రారంభం కావడంతో ఆర్థిక సాయం కోసం తల్లులంతా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే పిల్లలకు కుటుంబంలో ఒకరికి అమ్మఒడి పథకం వర్తింపజేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే వారందరికీ ఈ పథకం వర్తింపజేశారు. చంద్రబాబు ఒక కుటుంబంలో ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికి ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు.

అయితే హామీ ఇచ్చినట్టుగా అందరికీ ఇస్తారా? లేదా ఒక్కరికే ఇస్తారా? ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల్లో చదివే వారందరికీ ఇస్తారా లేక కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారికే చెల్లిస్తారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి, ఏది ఏమైనా ఈ పథకం ద్వారా తొందరగా ఆర్థిక సాయం అందించాలని తల్లులు కోరుతున్నారు. ఈ పథకానికి అర్హులైన వారు నక్కపల్లి మండలంలో 9500 మంది, పాయకరావుపేట మండలంలో 16800 మంది ఉన్నారు.

డబ్బులు ఎప్పుడు వేస్తారో..



మాది నీలిగుంట గ్రామం. నాకు ఇద్దరు పిల్లలు. బాబు నర్సీపట్నంలోని రిషి వ్యాలీలో 8వ తరగతి చదువుతున్నాడు. పాప పాములవాకలో 6వ తరగతి చదువుతోంది. తల్లికి వందనం పథకంలో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ చదువుకు డబ్బులు వేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. మా ఇద్దరు పిల్లలకు రూ.30 వేలు వస్తాయి. ఎపుడు వేస్తారో..

– ఎలుగుబంటి శాంతి, నీలిగుంట, కోటవురట్ల మండలం

హామీ నిలబెట్టుకుంటారని ఆశిస్తున్నాం



నాకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే తల్లికి వందనం పథకం కింద ఆర్థిక సాయం ఇస్తామన్నారు. మా పిల్లలిద్దరికి రూ.30 వేలు రావాలి. పాఠశాలలు ప్రారంభమయ్యాయి. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక సాయం వీలైనంత త్వరగా చెల్లిస్తే పిల్లలకు కావాల్సిన అవసరాలు తీర్చుకునే వీలు కలుగుతుంది. ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటారని ఆశపడుతున్నాం.

–టి.శ్రావణి, దేవవరం

జాప్యం చేయకుండా చెల్లించాలి



మాది పేద కుటుంబం, టైలరింగ్ చేసుకుంటూ జీవిస్తున్నాను. నా కుమారుడు ఆరో తరగతి చదువుతున్నాడు. గతంలో అమ్మఒడి పథకం వచ్చేది. చంద్రబాబు అధికారంలోకి వస్తే తల్లికి వందనం పథకం కింద రూ.15వేలు చొప్పున ఇస్తానని హామీ ఇచ్చారు. పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ఈ డబ్బులు తొందరగా ఇస్తే బాగుంటుంది, ఆశగా ఎదురు చూస్తున్నాం.

–ఐ.కృష్ణవేణి దేవవరం

ఫీజులు కట్టాల్సి ఉంది..



మా అబ్బాయి గౌతమ్ మోడల్ స్కూల్లో 4వ తరగతి చదువుతున్నాడు. ముఖ్యమంత్రి చంద్రబాబు తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి విద్యార్థికి రూ.15 ఇస్తామని ప్రకటించారు. పాఠశాలలో ఫీజు కట్టమని అడుగుతున్నారు. త్వరలో ఇస్తారని ఆశిస్తున్నాను.

–నక్కా గౌరి, పాయకరావుపేట

ఇద్దరికీ సాయం అందించాలి



మాకు పిల్లలు. వాడ్రాపల్లి హైస్కూల్‌లో చదివించుకుంటున్నా. పెద్దకొడుకు హేమంత్ 7వ తరగతి, చిన్న కొడుకు వంశీ 4వ తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంట్లో ఎంతమంది చదువుకుంటే అంత మందికి ఏడాదికి రూ.15వేలు ఇస్తామని చెప్పారు. హామీ మేరకు ప్రభుత్వం సాయం అందించాలి.

–బొచ్చ లక్ష్మి , వాడ్రాపల్లి (మునగపాక)

హామీ నెరవేర్చాలి



మాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెద్దోడు ప్రయివేటు కళాశాలలో డిగ్రీ చదువుకుంటుండగా, పాప పాటిపల్లి మోడల్ స్కూల్లో ఇంటర్ చదువుతుంది. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వం తల్లికి వందనం పేరిట సాయం త్వరగా అందించాలి.

–వాసా లక్ష్మి, కాకరాపల్లి (మునగపాక)

టెన్త్‌లో ఉత్తమ విద్యార్థులకు సత్కారం



ఉత్తమ ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న దృశ్యం



మెరిట్ విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : చదువులో మంచి మార్కులు సాధించి కుటుంబానికి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని రేవు పోలవరం ఉన్నత పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ చోడిపల్లి అప్పన్న అన్నారు. స్థానిక పాఠశాలలో ఈ ఏడాది 10 వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను అభినందించారు. అత్యధికంగా మార్కులు 550 మార్కులు సాధించిన విద్యార్థిని చోడిపల్లి అనూష, కారే మహేష్(539), వాసపల్లి వసంత (526), సూరాడ కృష్ణవేణి (519) లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, ఉపాధ్యాయులు మూర్తి, పి.స్వర్ణగౌరి పాల్గొన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతంలో పని చేస్తూ రెండు దఫాలు రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైన లెక్కల ఉపాధ్యాయిని పి.స్వర్ణగౌరిని పాఠశాలలో గురువారం తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఘనంగా సత్కరించారు.

ఐఐఐటీకి ముగ్గురు విద్యార్థినుల ఎంపిక



విల్లూరి యామిని



టెక్కలి జయశ్రీ



భీశెట్టి గీత

మునగపాక : మునగపాకకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఐఐఐటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన పదోతరగతి పరీక్ష ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులు పలు ప్రాంతాల్లోని ఐఐఐటీలకు ఎంపికైనట్లు ఎంఈవో వేణుగోపాలరావు తెలిపారు. విల్లూరి యామిని, టెక్కలి జయశ్రీలు ఒంగోలులోని ఐఐఐటీకి, భీశెట్టి గీత శ్రీకాకుళంలోని ఐఐఐటీకి ఎంపికయ్యారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఐఐఐటీకి ఎంపిక కావడం పట్ల ఆయా కుటుంబ సభ్యులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రణాళికతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్



టెన్త్‌లో మెరిట్ సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మునగపాక : సరైన ప్రణాళిక ఉంటే చదువులో రాణించవచ్చని ప్రముఖ సైకాలజిస్టు జె.ఎస్.వి.రావు తెలిపారు. తిమ్మరాజుపేట జెడ్పీ హైస్కూల్లో గురువారం తోసా ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన నిర్వహించారు. ఇష్టపడి కష్టపడి చదువుకుంటే పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ఏటా క్రమం తప్పకుండా తోసా ఆధ్వర్యంలో విద్యాభివృద్ధికి అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అంతర్జాతీయ గోల్డ్ మెడలిస్టు కళాధరరావు మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతుందన్నారు.

అనంతరం టెన్త్‌లో మెరిట్ సాధించిన విద్యార్థులకు బహుమతులు, స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. తోసా అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీ అప్పలనరసమ్మ, తోసా కార్యదర్శి దాడి వెంకట దుర్గారావు, కోశాధికారి అప్పలనాయుడు, శరగడం వెంకట రెడ్డినాయుడు, గురునాథ్, కొయిలాడ శివాజీ, సాయిరాం, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదువుకోవాలి

మునగపాక : విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకోవాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. దళితవాడలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం యూనిఫారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన జరుగుతుందని, అందువల్ల తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీఎంసీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం నేడు

యలమంచిలి రూరల్ : మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం ఉదయం 11.30 గంటలకు యలమంచిలి పురపాలకసంఘ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు కమిషనర్ ప్రభాకర్రావు విలేకరులకు తెలిపారు. చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి సంబంధించిన అజెండా అంశాలను ఇప్పటికే సభ్యులకు పంపించామన్నారు. అజెండా అంశాలతో పాటు టేబుల్ అంశాలు ఏవైనా ఉంటే సమావేశంలో సభ్యులు చర్చించి నిర్ణయం తీసుకుంటారన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లందరూ సమావేశానికి తప్పకుండా హాజరు కావాలని ఆయన సూచించారు.

నేడు పెన్షనర్ల సంఘం సమావేశం

యలమంచిలి రూరల్ : యలమంచిలి తాలూక స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎన్జీవో హోమ్‌లో జరుగుతుందని సంఘం అధ్యక్షుడు సీహెచ్ సోమేశ్వరావు మీడియాకు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వి.జగన్నాథరావు, జిల్లా జనరల్ సెక్రటరీ బిఎల్ఎన్ శర్మ, విశాఖ జిల్లా కార్యదర్శి మూర్తి హాజరవుతారన్నారు. తాలూక పరిధిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లంతా సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

వామనావతారంలో జగన్నాథుడు



జగన్నాథుడిని దర్శించుకుంటున్న భక్తులు



ఆకట్టుకున్న కోలాటం

మునగపాక : సుబధ్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామి గురువారం భక్తులకు వామనావతారంలో దర్శనమిచ్చారు. ఉదయం నుంచి మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లోని జగన్నాథున్ని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఈ నెల 17న జగన్నాథస్వామి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకరావుపేట : విద్యుత్ తీగలకు తగిలే చెట్ల కొమ్మలు నరికివేత కార్యక్రమం చేపడుతున్నందున శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. పాయకరావుపేట పరిధిలో పెదిరెడ్డినగర్, దేవీనగర్, చెక్కనగర్, ఆనంద్ నగర్, దొరనగర్, పీఎల్ పురం, నామవరం, సీతారాంపురం గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. సత్యవరం విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో సత్యవరం, మాసాహేబుపేట గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, వెంకటనగరం ఫీడరు పరిధిలో పాల్మన్‌పేట, కొర్లయ్యపేట, రాజయ్యపేట గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు.

కోటవురట్ల : పాములవాక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో జంగిల్ క్లియరెన్సు చేపడుతున్న కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ ఈఈ రామకృష్ణారావు తెలిపారు. చినబొడ్డేపల్లి, ఆక్సాహేబుపేట, పి.కొత్తపల్లి, రామన్నపాలెం, బోడపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

అచ్యుతాపురం: రాంబిల్లి మండలంలోని కొత్తూరు సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 12న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఆపరేషన్స్) కె.రాజశేఖర్ తెలిపారు. ఉదయం 9 గంటలకు నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. పంచదార్ల, అప్పరాయుడిపాలెం, భోగాపురం, ధారపాలెం, హరిపురం, వెంకటాపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి



చౌక ధరలకు నిత్యావసర వస్తువుల అమ్మకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్



రామ్మూర్తినగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

- ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్
- రామ్మూర్తినగర్‌లో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

యలమంచిలి రూరల్ : రాజకీయాలకు అతీతంగా పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సుందరపు సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని 15వ వార్డు రామ్మూర్తినగర్‌లో రూ.7 లక్షల 15 వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. పట్టణంలో ప్రజలకు అవసరమైన చోట అధ్వానంగా ఉన్న రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యమివ్వాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. అనంతరం చౌక ధరలకు నిత్యావసర సరుకుల విక్రయం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమం అమలు కోసం పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టణంలో రెండు చోట్ల ప్రత్యేక దుకాణాలను గుర్తించారు. ప్రధాన రహదారి పక్కన బండియ్యశెట్టి, కొత్తపేట శివాలయం వీధిలో ఉన్న ఫాతిమా స్టోర్సులో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. వీటిని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రస్తుత మార్కెట్లో కేజీ రూ.181 ఉన్న దేశవాళి కందిపప్పు రూ.160లకు, కేజీ రూ.55.85 ఉన్న బీపీటీ, సోనామసూరి బియ్యం రూ.49కి, కేజీ ధర రూ.52.40 ఉన్న బీపీటీ, సోనామసూరి బియ్యం రూ.48లకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి, మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు సత్యగుప్తా, బెజవాడ నాగేశ్వరావు, మున్సిపల్ కమిషనర్ ప్రభాకరావు, పిళ్లా త్రినాథరావు, కొటారు సాంబ, కొటారు నరేష్, బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, మొగలపల్లి భరత్, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కన్నబాబురాజు జన్మదిన వేడుకలు



యలమంచిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు



మునగపాకలో మాజీ ఎమ్మెల్యే రమణమూర్తిరాజు జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న పార్టీ శ్రేణులు

యలమంచిలి : వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజుల అడుగుజాడల్లో పనిచేసి మరలా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తామని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర అన్నారు. గురువారం యలమంచిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే యు.వి రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) జన్మదిన వేడుకలను పార్టీ కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో సుదీర్ఘ కాలంగా ఎమ్మెల్యేగా పనిచేసి ప్రజల అందరి మన్ననలు పొందిన నాయకుడు కన్నబాబురాజు అని అన్నారు.

ఎవరికైనా ఏ సమస్య తలెత్తినా ఒక్క ఫోన్ కాల్‌తో ప్రజల సమస్యలు తెలుసుకొని అధికారులతో చెప్పి పరిష్కరించేవారని ఇటీవలే ఆయన రాజకీయాలకు రిటైర్మెంట్ ప్రకటించినా ఇప్పటికీ ఆయన వెంటే నియోజకవర్గం కేడర్ అంతా ఉండి ఆయన అడుగుజాడల్లో మరలా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. కార్యకర్తలంతా కన్నబాబురాజు నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో యలమంచిలి మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు నాగత్రినాథ్ గుప్తా, యలమంచిలి రూరల్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి శివ, యలమంచిలి జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి భర్త సేనాపతి రాము, వార్డు కౌన్సిలర్లు పడాల కావ్య శ్రీను, పిట్టా సత్తిబాబు, గొర్లె సంధ్య వెంకట్ , మరిడేశ్వరరావు , కోఆప్షన్ సభ్యురాలు , షేక్ సయ్యద్ బీబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు మోహన్, వియ్యపు గోపి, కోడిగుడ్డు రమణ, దాసరి కుమార్, నర్సింహరావు, మణికంఠస్వామి పాల్గొన్నారు.

మునగపాక : మాజీ ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) హయాంలో మునగపాక మండలం అభివృద్ధి పథంలో పయనించిందని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. మునగపాకలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు జన్మదినం సందర్భంగా పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, వైస్ ఎంపీపీ బోజా శ్రీనివాసరావు, సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, సర్పంచ్‌లు తాతాజీ, విజయభాస్కరరాజు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కాండ్రేగుల జగన్, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, బొడ్డేడ బుజ్జి, మళ్ల కాశీసురేష్, పార్టీ నాయకులు కోనపల్లి రామ్మోహనరావు, పిల్లి అప్పారావు, శ్రీరామమూర్తి, చదరం అప్పలనాయుడు, ఆడారి కాశీబాబు, బొడ్డేడ మహేష్ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు జన్మదిన వేడుకలు నిర్వహించారు. పార్టీ కార్యకర్తల సమక్షంలో మండల పార్టీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లాలం రాంబాబు, కోన బుజ్జి, పిన్నమరాజు వాసు, మారిసెట్టి సూర్యనారాయణ, జువ్వాల నాయుడు,చేపల శ్రీరాములు,రాము,వడిశెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీ



ఎస్.రాయవరంలో ప్రపంచ జనాభా విన్యాసం

అచ్యుతాపురం : మండలంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవంపై గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రావ్య ఆధ్వర్యంలో ర్యాలీ, హరిపాలెంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి కల్యాణి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఎస్.రాయవరం: ప్రపచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని వమ్మవరం ఉన్నత పాఠశాలలో గురువారం ప్రదర్శన చేశారు. జనాభా పెరుగుదల వల్ల కలిగే అనర్థాలు, లాభాలు ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.